

పాలస్తీనా జెండాల ప్రదర్శన

గణతంత్ర దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడలో కొందరు యువకులు పాలస్తీనా జెండాలు ప్రదర్శించారు. - 8లో



జన్మభూమికి అంకితం

ప్రతి అవార్డు కన్నతల్లి లాంటి వెల్లంకి గ్రామానికి అంకితం చేస్తున్నట్లు కవి కూరెళ్ల విఠలాచార్య తెలిపారు. - 10లో



యాదాద్రిలో భక్తుల సందడి

యాదాద్రిలో భక్తుల సందడి నెలకొంది. శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో శ్రీస్వామిని దర్శించుకున్నారు. - 10లో

న్యూస్‌రీల్

నేడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాక

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థాన పుష్కరఘాట్ వద్ద ఉన్న అయిలేటి వాగుపై రూ.12.40 కోట్లతో నిర్మించే హైలెవల్ వంతెన, రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం రానున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఆలయ మాజీ చైర్మన్ దేప కర్ణకర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. మంత్రి హోదాలో మొదటిసారి కనగల్ మండలానికి కోమటిరెడ్డి వస్తుండటంతో కార్యకర్తలు భారీగా స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్



శేఖర్‌రెడ్డి

చిట్యాల : విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను చిట్యాల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు యాదాద్రి సర్కిల్ కన్జర్వేటివ్ ఆఫీసర్ శివాని డోంగ్రే ఉత్తర్వులు జారీ చేసినట్లు శుక్రవారం తెలిసింది. వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతులు లేకుండా బొగ్గు లోడుతో ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్న లారీని ఈ నెల 13వ తేదీన సూర్యాపేటలో ఆ జిల్లా ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. అదే లారీకి చిట్యాల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి ఈ నెల 15వ తేదీన అనుమతులు ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులకు పట్టుబడిన లారీకి రెండు రోజుల తర్వాత అనుమతులు ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన శేఖర్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

నేడు చెకుముకి సంబరాలు

నకిరేకల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం మండల స్థాయి చెకు ముకి సంబరాలు నిర్వహిస్తున్నట్లు వేదిక రాష్ట్రకమిటీ సభ్యుడు కసుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాఠశాల స్థాయి పరీక్షలు నిర్వహించిన పాఠశాలల నుంచి 8,9,10 తరగతుల్లో టాపర్‌లను సంబరాలకు తీసుకురావాలని కోరారు.

ఎంజీయూలో జెండా ఆవిష్కరణ



జెండాకు వందనం చేస్తున్న వీసీ గోపాల్‌రెడ్డి

ఎంజీయూ (నల్లగొండరూరల్) : నాణ్యమైన విద్య, నైతిక ప్రమాణాల ద్వారా భారతదేశ గణతంత్రం పరిఢవిల్లుతుందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల్ రవి, అధ్యాపకులు అంజిరెడ్డి, ఆకుల రవి, శ్రీదేవి, ప్రేమ్‌సాగర్, మద్దిలేటి, వసంత, రమేష్, హైమావతి, లక్ష్మీప్రభ పాల్గొన్నారు.

భక్తులను ఆకట్టుకున్న అమ్మవారి అలంకరణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనగల్: మండలంలోని దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి అలంకరణ శుక్రవారం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారిని అర్చకులు పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు.

సంక్షేమానికి పెద్దపీట

- వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు
- పథకాలను పేదలకు అందించడమే లక్ష్యం
- పకడ్బందీగా మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ అమలు

గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ హరిచందన

"కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు చిత్తశుద్ధితో ముందుకెళ్తోంది. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు జిల్లా యంత్రాంగం ప్రజల చెంతకు వెళ్లి పని చేస్తుంది. పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి.
– కలెక్టర్, హరిచందన దాసరి



పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ : అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ హరిచందన దాసరి పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం నల్లగొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలకు అందించడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 39.77 లక్షల మంది మహిళలు బస్సుల్లో ఉచితన ప్రయాణం చేశారని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని.. దీని ద్వారా పేదలకు ఉచితంగా కార్పొరేట్ సేవలు అందుతున్నాయన్నారు. కొత్త ప్రభుత్వం ప్రజల చెంతకే ప్రభుత్వ యంత్రాంగం వెళ్లాలని నిర్ణయించి అభయహస్తం ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించిందని.. అలా వచ్చిన 5,27,492 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేశామని తెలిపారు.

3,12,688 మందికి పెట్టుబడి సాయం..

2023–24 యాసంగి సీజన్‌లో 3,12,688 మంది రైతులకు రూ.172.41 కోట్లు పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందించిందన్నారు. ఉదయ సముద్రం, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తయితే 200 గ్రామాలకు తాగునీరు, 14 మండలాల పరిధిలో 3.61 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు.

నిర్మాణంలో సబ్‌స్టేషన్లు..

జిల్లాలో 2,29,838 మంది వ్యవసాయదారులు ఉచితంగా విద్యుత్ పొందుతున్నారని.. 2023–24 సంవత్సరంలో 6,439 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని తెలిపారు. రూ.30.18 కోట్లతో 15 విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మాణంలో ఉన్నాయి. దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద రూ.34,500 కోట్లతో 4 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో చేపడుతున్న థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు డిసెంబర్ నాటికి 5 యూనిట్లు పూర్తి చేసే విధంగా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.

2.63 లక్షల మంది కూలీలకు ఉపాధి

ఈజీఎస్ పథకం కింద 2023–24 సంవత్సరంలో రూ.130.64 కోట్లు ఖర్చు చేసి 2.63 లక్షల మంది కూలీలకు 59.88 లక్షల పని దినాల్లో ఉపాధి కల్పించామన్నారు. 2,10,611 మందికి నెలకు రూ.53.73 కోట్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.



చేనేత స్టాల్‌లో రాట్నం తిప్పతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ చందనాదీప్తి

మంత్రి చొరవతో నిధులు..

కొత్త ప్రభుత్వం ఏర్పడగానే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో నల్లగొండ నుంచి ముశంపల్లి మీదుగా ధర్మాపురం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.99.80 కోట్లు మంజూరు చేసిందన్నారు. రూ.292.71 కోట్లతో జిల్లాలో రోడ్లు, బ్రిడ్జిలు, బీటీ రెన్యువల్స్ ఇతర విస్తరణ పనులకు కొనసాగుతున్నాయన్నారు. మున్సిపాలిటీల్లో వివిధ పథకాల కింద రూ.533 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

రూ.275 కోట్లతో మెడికల్ కళాశాల

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని అందులో భాగంగా జిల్లా కేంద్రంలో రూ.275 కోట్లతో చేపట్టిన మెడికల్ కళాశాల భవనం పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. రూ.23.75 కోట్లతో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 50 పడకలతో క్రిటికల్ కేర్ బ్లాక్ మంజూరైందని తెలిపారు. మిర్యాలగూడలో వంద పడకల ఏరియా ఆస్పత్రిని 200 పడకలకు పెంచేందుకు రూ.14.60 కోట్లు, నకిరేకల్ ఆస్పత్రి అప్‌గ్రేడ్‌కు రూ.32 కోట్లు, హాలియాలో 30 పడకల సీహెచ్‌సీ ఏర్పాటుకు రూ.5.30 కోట్లు మంజూరయ్యాయని.. వీటి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహకారం, సూచనలు అందిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రధాన న్యాయమూర్తి, ఎస్పీ, ఉద్యోగులకు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మీడియా ప్రతినిధులకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శకటాల ప్రదర్శన, వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎస్పీ చందనా దీప్తి, అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్‌పాటిల్, జె.శ్రీనివాస్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన



ఎస్సీ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, పోలీస్ కళాకారులు నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాగర్ బాలభవన్, నల్లగొండలోని సెయింట్ ఆల్ఫోన్సెస్, అప్పాజీపేట బీసీ గురుకుల పాఠశాల, చర్లపల్లి ఎస్సీ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశాయి.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ హరిచందన

జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే నెల రోజుల్లో నల్లగొండ పట్టణంలో రూ.300 కోట్లతో డ్రెయినేజీ నిర్మాణానికి టెండర్లు పిలుస్తామన్నారు. నల్లగొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజల అవసరాల కనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. రూ.20 కోట్లతో కలెక్టరేట్ వద్ద స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణ పనులు చేపడుతున్నామని.. ఆ పనులను కలెక్టర్‌తో శనివారం ప్రారంభిస్తామని చెప్పారు. స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా యువతకు వివిధ రంగాల్లో ఉద్యోగాలు పొందేందుకు శిక్షణ అందుతుందన్నారు. ఇక్కడ శిక్షణ పొందడం ద్వారా వారు ఉపాధి పొందగలుగుతారని చెప్పారు.

బెటాలియన్‌లో సమస్యలు పరిష్కరిస్తా

నల్లగొండ క్రైం : అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బెటాలియన్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెటాలియన్‌లో అంతర్గత రోడ్లు, గుమ్మల బావి నుంచి ఫైరింగ్ రేంజ్ వరకు బీటీ రోడ్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో కమాండెంట్ సత్యశ్రీనివాస రావు, అసిస్టెంట్ కమాండెంట్లు చంద్రశేఖర్, ఉదయభాస్కర్, తిరుపతి, యుగేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



బెటాలియన్‌లో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
- రైతు సంఘం ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ర్యాలీ

మిర్యాలగూడ : ప్రభుత్వాలు కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. రైతు చట్టాలపై కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రైతు పండించిన పంట మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమంలో ప్రాణాలను కోల్పోయిన వారి కుటుంబాలను కేంద్రం ఆదుకోవాలన్నారు. కొత్త కేంద్రం తీసుకొచ్చే లేబర్ చట్టాలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఎడమకాల్వ పరిధిలోని ఆయకట్టుకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు మల్లు గౌతంరెడ్డి, తిరుపతి రామ్మూర్తి, రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, వినోద్‌నాయక్, గోవర్ధని, శ్రీనివాస్‌రెడ్డి, పిల్లుట్ల సైదులు, మంద రాజు, నాయుడు, రామచంద్ర, కోడిరెక్క మల్లయ్య, రాంరెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ల ర్యాలీలో పాల్గొన్న జూలకంటి రంగారెడ్డి

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఊంజలి సేవ వైభవంగా నిర్వహించారు. ఆండాళ్‌దేవిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజలి సేవ నిర్వహించారు. అంతకుముందు వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం అభిషేకం, అర్చనలు జరిపించారు. ఇక ఆలయ ముఖ మండపం, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శనహోమం, నిత్యకల్యాణం, జోడు సేవలు తదితర కైంకర్యాలు గావించారు.

ధరణిలో 'భూ'సిత్రాలు

పట్టా ఒకరిది.. కబ్జాలో మరొకరు

- సాదాబైనామాతో భూముల పట్టాల మార్పిడి
- లేని భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదు
- ఒకే పేరు ఉన్నవారికి శాపంగా మారిన పోర్టల్
- పెండింగ్ దరఖాస్తులకు కలగని మోక్షం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు



ఈ ఫొటోలోని వ్యక్తి బుర్రి వెంకన్న. దామచర్ల మండలం దిలావర్‌పూర్‌లో ఇతనికి సర్వే నెం.514లో 2.20 ఎకరాల భూమి ఉంది. ఇది వారసత్వంగా వస్తునే ఉంది. అయితే ఇటీవల ధరణిలో తమ భూమి చూసుకునేందుకు వెళ్లగా ఆ సర్వే నంబర్‌లో భూమి మాయమైంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు ఆ సర్వే నంబర్‌లో ఉన్న మొత్తం భూమి పట్టాదారుల లిస్ట్ తీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అదే పేరుతో మరొకరు ఉండడంతో ఫోర్జరీ సంతకాలతో సాదాబైనామా ద్వారా ఆ భూమి మరొకరికి పట్టా చేసినట్లు తెలిసింది. దీంతో అసలు పట్టాదారైన బుర్రి వెంకన్న లబోదిబోమంటున్నాడు. అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వెంకన్నకోరుతున్నాడు. ఇలా సాదాబైనామాల ఆధారంగా రెవెన్యూ అధికారుల అండతో వందల ఎకరాల భూములు ఇతరుల పేర్ల మీదకు మారినట్లు తెలుస్తోంది.

మిర్యాలగూడ : ధరణి పోర్టల్‌లో భూమాయ వల్ల అనేక సిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. సాదాబైనామాలతో భూముల పట్టాలు మారాయి. పట్టాలో ఒకరు.. కబ్జాలో మరొకరు ఉన్నట్లు రికార్డులో స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు రెవెన్యూ అధికారుల చేతివాటంతో వందల ఎకరాల్లో భూములు మాయమయ్యాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త ప్రభుత్వ విధివిధానాలతోనైనా జరిగిన తప్పులు సరిదిద్దే అవకాశం ఉంటుందో లేదోనని బాధితులు మదనపడుతున్నారు.

ఏళ్ల నుంచి కబ్జాలో ఉంటున్నా..

వారసత్వంగా వచ్చిన భూములు ఏళ్ల తరబడి కబ్జాలో ఉంటున్నా ధరణిలో మాత్రం తక్కువగా చూపుతున్నాయి. ఇలా ఎలా జరిగిందని బాధితులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం మాకు సంబంధం లేదు, మా చేతిలో ఏం లేదు, ధరణిలో పొరపాట్లు జరిగితే హెచ్‌యూడీ, సీసీఎల్‌ఏ వద్దకు వెళ్లాలని చెబుతున్నారు. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పరిష్కారం కావడం లేదని రైతులు వాపోతున్నారు.



ధరణిలో లొసుగులను ఆసరాగా చేసుకుని..

ధరణి వెబ్‌సైట్ పుణ్యమా అని అప్పటి ప్రభుత్వం అందించే రైతుబీమా, రైతుబంధు కోసం అనేక మంది ధరణిలో లొసుగులు, అధికారుల సహకారంతో అక్రమాలకు పాల్పడాడు. ఇలాంటి సంఘటనలు ఒక మిర్యాలగూడ డివిజన్‌లోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా బయటపడుతున్నాయి. చివరికి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుంటున్నా.. తమ భూములను తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే అంతోఇంతో ముట్టచెప్పాల్సిన పరిస్థితి దాపురించిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్‌లో భారీగా దరఖాస్తులు..

జిల్లా వ్యాప్తంగా టీఎం–33 (మార్పులు–చేర్పుల) దరఖాస్తులు వేలాదిగా వచ్చాయి. అందులో కొన్ని పరిష్కరించగా మిగతావి పరిష్కారానికి నోచుకోలేదు. కొత్త ప్రభుత్వం ధరణిపై స్పష్టత ఇవ్వకపోవడంతో సమస్య ఎలా పరిష్కరించాలో రెవెన్యూ అధికారుల చేతిలో లేకుండా పోయింది. దీంతో భూమి తక్కువగా చూపుతున్న, వేరే వారి పేరు మీదకు వెళ్లిన భూముల రైతులు తమకు ఎప్పుడు న్యాయం జరుగుతందని అంటున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



"ధరణి పోర్టల్‌కు సంబంధించిన విధి విధానాలపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. వచ్చిన వెంటనే భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం.
– బి.చెన్నయ్య, ఆర్డీఓ, మిర్యాలగూడ





'జన'పహాడ్

సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా ఉర్సు సందర్భంగా శుక్రవారం నిర్వహించిన గంధోత్సవానికి తరలివచ్చిన భక్తులు, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ హరిచందన చిత్రంలో ఎస్పీ చందనాదీప్తి, డీఈఓ భిక్షపతి


స్వాతంత్ర్య సమరయోధులను సత్కరిస్తున్న కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనా దీప్తి


ప్రదర్శ ఇస్తున్న మున్సిపల్ శాఖ రూపొందించిన శకటం


వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో రూపొందించిన శకటం ప్రదర్శన


స్టాళ్లలో డ్రోన్ స్ప్రేయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనా దీప్తి, అదనపు కలెక్టర్లు

ఉత్తమ సేవకులకు గుర్తింపు

విధి నిర్వహణలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు గుర్తింపు లభించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నల్లగొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను కలెక్టర్ హరిచందన ఎగురవేశారు. అనంతరం ఎస్పీ చందనా దీప్తి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. -నల్లగొండ


కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్సీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్


ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ


రవికుమార్, ఆర్డీఓ, నల్లగొండ | రాజ్‌కుమార్, హౌసింగ్ పీడీ, నల్లగొండ | కోటేశ్వర్‌రావు, జీఎం పరిశ్రమల శాఖ | విష్ణువర్ధన్‌రెడ్డి, డీపీఓ, నల్లగొండ


శ్రీదేవి, పీఏ స్పెషల్ కలెక్టర్, ఏఎమ్మార్పీ | గణపతిరావు, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్ | కృష్ణమూర్తి, సూపరింటెండెంట్, నల్లగొండ | హేమలత, సూపరింటెండెంట్, నల్లగొండ | ప్రసాద్, సీసీ కలెక్టర్ నల్లగొండ | ఆసిఫ్ అలీ, సీసీ అడిషనల్ కలెక్టర్ | జలేందర్, సీసీ అడిషనల్ కలెక్టర్ , నల్లగొండ | సత్యనారాయణ, ఆఫీస్ సబార్డినేట్, నల్లగొండ | వెంకటేశం, జూనియర్ అసిస్టెంట్, నల్లగొండ | శ్రీనివాసశర్మ, తహసీల్దార్, వేములపల్లి | సందీప్, సీనియర్ అసిస్టెంట్, నిడమనూరు | వెంకటమ్మ, ఆఫీస్ సబార్డినేట్, నిడమనూరు


దివ్యారెడ్డి, తహసీల్దార్, కొండమల్లేపల్లి | రూనీస్, సీనియర్ అసిస్టెంట్ | రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, చండూరు | స్వప్న, తహసీల్దార్, కట్టంగూర్ | రావుల సైదయ్య, సీనియర్ అసిస్టెంట్ | ముడావత్ కేశవ, డిప్యూటీ డీఈఈ | వేదమణి, సీనియర్ అసిస్టెంట్ | వెంకటనాగేశ్వర్‌రావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ | మహ్మద్ అతహర్ పర్వేజ్, ఎంపీఓ, కట్టంగూర్ | రమేష్‌రెడ్డి, మన ఊరు మన బడి కోఆర్డినేటర్ | నాగేశ్వర్‌రావు స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ, నల్లగొండ | నాగయ్య, డీఈఈ పంచాయతీరాజ్


గోలి శ్రీనివాస్, డిప్యూటీ రిజిస్ట్రార్, నల్లగొండ | సుభాష్, ఎక్సైజ్ కానిస్టేబుల్, మిర్యాలగూడ | శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్, జిల్లా జైలు | మహ్మద్ అలీ, ఆఫీస్ సబార్డినేట్, నల్లగొండ | హిమబిందు, డేటా ఎంట్రీ ఆపరేటర్, నల్లగొండ | గాదె యాదయ్య, బీసీ కార్పొరేషన్ | అనంతరెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ | లీలావతి, అంగన్‌వాడీ టీచర్, అనుముల | అబుల్ అలీం, సీనియర్ ఇన్‌స్పెక్టర్, ట్రైబర్ వెల్ఫేర్ | నిర్మల, సీడీపీఓ, నల్లగొండ | యాదయ్య, ఈఈ, మిషన్ భగీరథ, నల్లగొండ | శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ, నల్లగొండ


యాదగిరి, ఎంపీడీఓ, నార్కట్‌పల్లి | యాకుబ్, ఎంపీడీఓ, మునుగోడు | ఖాజా అజ్గర్ అలీ, ఎంపీడీఓ, తిరుమలగిరి | శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్, నల్లగొండ | చంటి, జూనియర్ అసిస్టెంట్, నేరడుగొమ్ము | పార్వతీచౌహాన్, ఎంపీఓ, హాలియా | రాజమోహన్, ఫైర్ ఆఫీస్, నల్లగొండ | జుబేదా, ఆశా వర్కర్, లైన్‌వాడ, నల్లగొండ | రాఘవేంద్ర, కంప్యూటర్ ఆపరేటర్, నల్లగొండ | యాట వెంకటేశ్వర్లు, ఏపీఓ, పెద్దవూర | రాజీవ్ ఆరోగ్యశ్రీ ఏరియా ఆస్పత్రి, దేవరకొండ | కిమ్స్ హాస్పిటల్, నార్కట్‌పల్లి


శంకరయ్య, ఎస్‌ఐ, వీఆర్ నల్లగొండ | ఉపేందర్‌స్వామి, ఏఎస్‌ఐ ఉమెన్ పీఎస్ | భావ్‌సింగ్, ఏఎస్‌ఐ, హాలియా | వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్, నల్లగొండ | అలీ అహ్మద్, హెడ్‌కానిస్టేబుల్, నిడమనూరు | యాసిన్ షరీఫ్, ఏఎస్‌ఐ, మిర్యాలగూడ వన్‌టౌన్ | లాజర్, డీఆర్, నల్లగొండ | సుదర్శన్, హెడ్‌కానిస్టేబుల్, వన్‌టౌన్ | బ్రహ్మచారి, హెడ్‌కానిస్టేబుల్, నల్లగొండ | వెంకట్‌రెడ్డి, ఏపీపీ, నల్లగొండ | వెంకటరమణారెడ్డి, ఏపీపీ, ఉమెన్స్ కోర్టు | అశోక్, ఆర్ఎస్‌ఐ, ఏఆర్ నల్లగొండ


మహబూబ్ అలీ, ఏఎస్‌ఐ, చిట్యాల | నరేష్, ఆర్‌ఐ హోంగార్డ్స్, ఏఆర్ నల్లగొండ | మమత,ఆర్ఎస్‌ఐ, నల్లగొండ | అంజద్, ఏఆర్, హెడ్‌క్వార్టర్స్ నల్లగొండ | మహబూబ్ అలీ, సీనియర్ అసిస్టెంట్ | యువరాజు, డీపీఓ, నల్లగొండ | నాగరాజు, ఎస్‌ఐ టూటౌన్, నల్లగొండ | గాంధీనాయక్, సీఐ, హాలియా | రాఘవేందర్‌రెడ్డి, సీఐ, కొండమల్లేపల్లి


గౌసుద్దీన్, ఎస్‌ఐ, డీఎస్‌బీ, నల్లగొండ | సురేందర్‌రెడ్డి, ఏఎస్‌ఐ, డీఎస్‌బీ | వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ ఎలక్షన్ సెల్ | శ్రీను, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, డీసీఆర్‌బీ | మానస, ఉమెన్ ఎస్‌ఐ, పోలీస్ కేంద్రం, నల్లగొండ | నరేందర్, హెడ్‌కానిస్టేబుల్, డీసీఆర్‌బీ


రాఘవరావు, సీఐ, శాలిగౌరారం | కన్నయ్య, ఏఆర్ఎస్‌ఐ | పాండు, సబ్ ట్రెజరీ ఆఫీసర్, నల్లగొండ | రామకృష్ణ, ఎస్పీగన్‌మన్ నల్లగొండ | గుండు సతీష్, కానిస్టేబుల్, నల్లగొండ

విద్యుదాఘాతంతో ఉప సర్పంచ్ మృతి

నిడమనూరు: నిడమనూరు మండలం మార్లగడ్డ క్యాంపు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ గొడిటి శ్రీనివాసరావు(52) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మార్లగడ్డ క్యాంపునకు చెందిన శ్రీనివాసరావు, తన పెద్ద కుమారుడు కిరణ్‌తో కలిసి శుక్రవారం ఇంటి సమీపంలోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బంచింగ్ కేబుల్ లాగుతున్నారు. బంచింగ్ కేబుల్‌కు ఉన్న అల్యూమినియం వైరు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న వైరుకు తగలడంతో విద్యుత్ సరఫరా అయి దానిని పట్టుకున్న శ్రీనివాసరావు, కిరణ్ విద్యుదాఘాతానికి గురయ్యారు. క్షతగాత్రులను మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గొడిటి శ్రీనివాసరావు మృతిచెందగా, కిరణ్ కోలుకుంటున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మిర్యాలగూడలో పాలస్తీనా జెండాల ప్రదర్శన

- సోషల్ మీడియాలో వైరలైన దృశ్యాలు
- యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


మిర్యాలగూడ పట్టణంలో పాలస్తీనా జెండాలను ప్రదర్శిస్తున్న యువకులు

మిర్యాలగూడ అర్బన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడలో కొందరు యువకులు పాలస్తీనా దేశానికి చెందిన జెండాలు ప్రదర్శించారు. నలుగురు(విద్యార్థులు) యువకులు మిర్యాలగూడ పట్టణంలోని బ్లూ వెల్ ప్యాలెస్ భవనం మెట్లపై నిలబడి పాలస్తీనాకు చెందిన రెండు జెండాలను పట్టుకుని ప్రదర్శించారు. వారు ప్రదర్శిస్తున్న సమయంలో తమ స్నేహితులతో వీడియో, ఫొటోలు తీయించుకున్నారు. ఆ సమయంలో సమీపంలోని కొందరు యువకులు ఆ దృశ్యాలను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ ఘటనా స్థలానికి చేరుకుని నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ వెంకటగిరి యువకులను విచారిస్తున్నారు. ఒక వైపు గణతంత్ర వేడుకల్లో పట్టణ వాసులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉండగా అదే సమయంలో యువకులు పాలస్తీనా జెండాలను ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. పాలస్తీనా జెండాలు ప్రదర్శించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్యామ్ డిమాండ్ చేశారు.